క్లుప్తంగా

ఆలయాల్లో పూజలు



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి

కలకడ : శ్రావణమాసం పూర్తి కావడంతోపాటు శనివారం అమావాస్య రావడంతో అనేక మంది శనివారం మధ్యాహ్నం అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఉదయం 11.15 గంటలకు శుభముహూర్తం పూర్తి అయి అమావాస్య, తదనంతరం పాడ్యమి గడియలు, శనిప్రాభల్యం తొలగుతాయని వేదపండితులు తెలియజేయడంతో అన్ని ఆలయాల్లో మధ్యాహ్నం దిష్టి టెంకాయలు కొట్టి, నిమ్మకాయలతో దిష్టితీశారు. అనేక మంది అమావాస్య సమయంలో బూడిదగుమ్మడికాయలు పూజల్లో పెట్టి ఇంటి ముందు, వ్యాపారస్థలాల వద్ద ఏర్పాటు చేసుకున్నారు.

రేపు కౌన్సిల్ మీట్

మదనపల్లె : మదనపలె సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం సాయంత్రం 3:30 గంటలకు నిర్వహిస్తున్నట్టు చైర్‌పర్సన్ వి.మనూజ తెలిపారు. 29 అంశాలపై కౌన్సిల్ సమావేశంలో చర్చించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పట్టెంవాండ్లపల్లి పంచాయతీ బాగేపల్లికి చెందిన తుంగేటి ఆంజనేయులు అనే వ్యక్తి వైఎస్ఆర్ సీపీ పాలనలో గ్రామ వలంటరీగా పని చేసేవాడు. అనారోగ్యం కారణంగా సదరు వలంటీర్ ఏడాదిన్నర క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అంతకు మునిపే అతని భార్య కూడా అనారోగ్యంతో చనిపోయింది. ఈ దంపతులకు కలిగిన యుగంధర్ అనే బాలుడు అనాథగా మిగిలాడు. ఈ విషయాన్ని వలంటీర్ తండ్రి ఆదెప్ప తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చాడు. కన్నవాళ్లను కోల్పోయిన తన మనవడిని ఆదుకోవాలని ఎమ్మెల్యే ఎదుట వాపోయాడు. సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి బాలుడి చదువు కోసం రూ.లక్ష ఆర్థిక సహాయం చేశారు. సదరు నగదును శనివారం ఎంపీపీ మహమ్మద్, జెడ్పీటీసీ శివన్న, వైస్ ఎంపీపీ శోభ శంకర్, సర్పంచులు లక్ష్మీదేవి రహమతుల్లా, ఎంపీటీసీ కార్యం చంద్రశేఖర్, నారాయణస్వామిలు ఆదెప్పకు అందజేశారు.

ఆన్‌కాల్ డ్రైవర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ : ఆన్‌కాల్ డ్రైవర్ల పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక డిపోలో గేట్ మీటింగ్ నిర్వహించారు. డ్రైవర్ల కొరత ఎక్కువ ఉన్నందున ఆన్‌కాల్ డ్రైవర్లను నియమించనున్నట్లు తెలిపారు. గ్యారేజీ సిబ్బంది కండీషన్‌తో ఉన్న బస్సులను ఇవ్వాలన్నారు. బ్యాటరీ లైఫ్, కెఎంపిఎల్ 5.40తో రీజియన్‌లో మొదటి స్థానంలో ఉన్నామన్నారు. ఈనెల 15వతేదీ నుంచి ఈపీకె, ఓఆర్ తగ్గిపోయిందని ట్రాఫిక్ జనరేటింగ్ పాయింట్ వద్ద ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. స్త్రీ శక్తి పథకంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

నందలూరు : మండలంలోని వివిధ ప్రాంతాల్లో వేసిన అనధికార లేఅవట్లు, ప్లాట్లు, స్థలాల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 134 జీఓ ప్రకారం ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కడప పట్టణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ సిటీ కృష్ణసింగ్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, అనధికార లేఅవట్లు యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ 30వ తేదీలోపు అనధికార వెంచర్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్ జరిగిన స్థల యజమానులు మాత్రమే అర్హులుగా ఉంటారన్నారు. 90 రోజుల్లోపు లైసెన్స్ కలిగిన ప్లానర్స్ లేదా వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదుకు గడువు ఉందని తెలిపారు. ప్లానింగ్ ఆఫీసర్ ఇందు, ప్లానింగ్ సెక్రటరీ మునెయ్య, పంచాయతీ సెక్రటరీలు శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

సుందరమైన మదనపల్లెగా తీర్చిదిద్దుదాం



మదనపల్లె : మొక్క నాటిన సబ్‌కలెక్టర్ కల్యాణి, కమిషనర్ ప్రమీల



కలికిరి : స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది



తంబళ్లపల్లె : అవగహన ర్యాలీలో స్పెషల్ ఆఫీసర్ అమరనాథరెడ్డి

సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

మదనపల్లె : చల్లటి మదనపల్లెను సుందరమైన, పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి కోరారు. స్వచ్ఛ అంధ్ర స్వర్ణ అంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక రామారావు హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. మొక్కను నాటి నీరుపోశారు. ఎస్‌హెస్‌జీ మహిళలు అక్కడ ఏర్పాటు చేసిన జూట్, క్లాత్‌లతో చేతితో తయారు చేసిన వాటిని పరిశీలించి వాటికి ప్రచారం కల్పించి వినియోగం పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. వీటి ప్రయోజనాలను వివరిస్తూ మహిళ ఆదాయం పెరిగేలా కృషి చేయాలని కోరారు. అనంతర ం స్వయం సంఘాల మహిళలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మదనపల్లె పట్టణాన్ని సుందరంగా పెట్టుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇంటిలోని చెత్తను రోడ్లు, మురికి నీటి కాలువల్లో పారవేయవద్దని సూచించారు. వాటిని మీ ఇళ్లవద్దకు చెత్త సేకరణ కోసం వచ్చే పారిశుధ్య కార్మికులకు అప్పగించాలని కోరారు. మున్సిపల్ కార్మికులు డోర్ టూ డోర్ కలెక్షన్ చేసేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ప్రమీలను ఆదేశించారు. పట్టణంలో విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

నిమ్మనపల్లె : గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్ అన్నారు. ఎంపీడీఓ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజుతో కలిసి నిమ్మనపల్లెలో స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ పద్మావతి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

తంబళ్లపల్లె : ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యం చేకూరుతుందని స్పెషల్ ఆఫీసర్ అమరనాథరెడ్డి తెలిపారు. మండలం కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణంధ్రా కార్యక్రమం నిర్వహించారు. నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ చేశారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ థామస్, ట్రాన్స్‌కో ఎఇ భాస్కర్, ఫోర్డు ప్రతినిధి నరసింహులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ర్యాలీ

బి.కొత్తకోట : స్థానిక నగర పంచాయతీ కమిషనర్ జీవీ.పల్లవి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని బి.కొత్తకోటలో నిర్వహించారు. జ్యోతిచౌక్‌లో ర్యాలీ నిర్వహించి హాజరైన ప్రజాప్రతినిధులు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి పాల్గొని ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. ఎంపీడీఓ కృష్ణవేణి, ఏపీఎం రాజేశ్వరీ, సంఘమిత్రలు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గంజి మోహన్, మస్తాన్, నాసిర్, ఓబులేసు, ఇమాంసాబ్ పాల్గొన్నారు.

వర్షా కాలంలో జాగ్రత్తలు పాటించాలి

కలికిరి : స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీడీఓ మహమ్మద్ రియాజుద్దీన్ ఆధ్వర్యంలో కలికిరిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని, వర్షాకాల పరిశుభ్రతపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగార్జున, సూపరింటెండెంట్ సురేంద్రబాబు, ఈఓ అశోక్, సర్పంచ్ ఎల్లయ్య, పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యోగేష్‌రెడ్డి, శంకర, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఎన్ఎస్ఎస్-హెచ్ఎన్ఎస్ఎస్ అనుసంధానం చేపట్టాలి

- హంద్రీ–నీవా ఘనత వైఎస్.రాజశేఖరరెడ్డిది
- సమన్వయకర్త నిసార్ అహమ్మద్



మదనపల్లె : కరువు ప్రాంతం సస్యశ్యామలం కోసం వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన గాలేరు నగరి- హంద్రీనీవా ప్రాజెక్టుల అనుసంధానాన్ని చేపట్టి పూర్తి చేయాలని వైఎస్ఆర్‌సీపీ మదనపల్లె సమన్వయకర్త నిసార్ అహమ్మద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగునీరు అందించిన ఘనత దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి దక్కుతుందన్నారు. హంద్రీనీవా కోసం రెండు దశల్లో రూ.6800 కోట్లు మంజూరు చేసి నిర్మాణానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇందులో 85 శాతం పనులు పూర్తి అయినట్టు చెప్పారు. చంద్రబాబు పాలనలో పడకేసిన పనులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వేగంగా పూర్తి చేయించినట్టు చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి గాలేరు నగిరి, హంద్రీనీవా అనుసంధానం కోసం రూ.నాలుగు వేల కోట్లతో టెండర్లు పిలిచి పనులు చేపట్టగా వాటిని కూటమి ప్రభుత్వం రద్దు చేసింది అన్నారు. వీటి పనులు మళ్లీ చేపట్టాలని డిమాండ్ చేశారు. కదిరి, తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు పుంగనూరు, కుర్బు బ్రాంచ్ కెనాల్ ద్వారా సాగు, తాగు నీరు అందించాలంటే గాలేరు, నగరి – హంద్రీనీవాకు అనుసంధానం చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టుపై కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తే ఉమ్మడి చిత్తూరు జిల్లాతోపాటు అనంతపురం జిల్లాలోని కొన్ని నియోజకవర్గాలు సస్యశ్యామలం అవుతాయని అన్నారు. హంద్రీనీవా కాలువ నీటి సామర్థ్యం పెంచి ప్రాజెక్టులు, చెరువులకు నీరు అందించాలని కోరారు. మదనపల్లె ప్రజలకు తాగునీరు అందించే చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేయాలని, తద్వారా గతంలో చేపట్టిన నీటి ప్రాజెక్టు ద్వారా ఇంటింటికి నీరు అందించాలని కోరారు.

ముమ్మరంగా స్వామిత్ర కుటుంబ సర్వే

గుర్రంకొండ : మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు స్వామిత్ర కుటుంబ సర్వే ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. వారం రోజుల నుంచి గుర్రంకొండ, చెర్లోపల్లె, ఎల్లుట్ల, శెట్టివారిపల్లె, తరిగొండ, మర్రిపాడు గ్రామాల్లో స్వామిత్ర సర్వే జరుగుతోంది. ఆయా గ్రామాల సచివాలయాల్లోని వీఆర్వోలు, సర్వేయర్లు మినహా మిగిలిన ఉద్యోగులు బృందాలుగా విడిపోయి ఈ సర్వే కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఆయా గ్రామాల పరిధిలోని ప్రతి ఇంటిని సర్వే చేస్తున్నారు. ×ఇల్లు నిర్మించుకొన్న యజమాని పేరు, ఇంటి నిర్మాణం ఎప్పుడు జరిగింది. ఇల్లు ఎంత మేరకు విస్తీర్ణంలో ఉంది, సదరు యజమానికి ఇంకా ఎన్ని ఇళ్లు ఉన్నాయి₹ అనే పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. సర్వే పూర్తి చేసిన తరువాత ప్రతి కుటుంబానికి స్వామిత్ర కార్డును అధికారులు అందజేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో బ్రహ్మానందరెడ్డి, గుర్రంకొండ మేజర్ పంచాయతీ ఈవో శ్రీహరి తెలిపారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఓటరు, పాన్ కార్డు తరహాలో స్వామిత్ర కార్డులు రానున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్డుకు ఆధార్ కార్డు అనుసంధానం కానుండటంతో కార్డు నంబరును ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే సదరు కార్డుదారుని పేరిట ఎంత మేరకు ఆస్తి ఉంది. ఎన్ని ఇళ్లు ఉన్నాయి తదితర పూర్తి వివరాలు అందులో కనిపించనున్నాయి. ఇంకా వారం రోజుల పాటు ఈ సర్వే ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు.



గుర్రంకొండలో స్వామిత్ర సర్వే నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలి

మదనపల్లె రూరల్ : యూరియాపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి తెలిపారు. శనివారం సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి, మండల వ్యవసాయాధికారి నవీన్‌రెడ్డితో కలిసి పట్టణంలోని ప్రైవేట్ ఎరువుల దుకాణం, మండలంలోని బసినికొండ, కొండామారిపల్లె, వేంపల్లె రైతుసేవా కేంద్రాల్లో ఎరువుల నిల్వలు, పంపిణీని పరిశీలించారు. యూరియా లభ్యతపై రైతులను అడిగి తెలుసుకున్నారు. పంపిణీలో ఎదురవుతున్న సమస్యలు, వినియోగంపై చర్చించారు. రైతుసేవా కేంద్రాల్లో అవసరమైన రసాయనిక ఎరువుల కొరత రానివ్వకుండా సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. రసాయనిక ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, తగినన్ని నిల్వలు లేవని నివారించినా సంబంధిత సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు యూరియా విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కావాల్సిన వారు సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు ఒరిజినల్ పట్టాదారు పాసు పుస్తకం తీసుకెళ్లి తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలసుబ్రహ్మణ్యం, వీఆర్వోలు, వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్, వ్యవసాయ అధికారులు

ఎరువుల దుకాణం తనిఖీ

కలికిరి : కలికిరిలోని ఓ ఎరువుల దుకాణాన్ని విజిలెన్స్ సీఐ నారాయణ ఆధ్వర్యంలో అధికారులు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో ఎరువుల నిల్వ, స్టాక్ రిజిస్టరు, బిల్లు తదితరాలను పరిశీలించారు. ఎరువుల నిల్వ వివరాలతో దుకాణం ముందు బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. నిబంధనల మేరకు నిర్ణయించిన ధరకే ఎరువులు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు హరికుమార్, ఏఓ హేమలత, కానిస్టేబుల్ గిరి పాల్గొన్నారు.

హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపరాదు

తంబళ్లపల్లె : హెఐవీ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని ఐసీటీసీ కౌన్సిలర్ ఎం.చంద్రమోహన్ అన్నారు. స్థానిక టీఎస్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శనివారం మీకు తెలుసా? కార్యక్రమంలో భాగంగా ఐసీటీసీ, కృషి సంస్థ సంయుక్తంగా హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ నాగరాజు, అధ్యాపకులతో కలిసి అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. హెచ్ఐవీ, సుఖ వ్యాధులు ఎలా వస్తాయనే విషయాన్ని వివరించారు. రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ఆగస్టు 12న అంతర్జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకుని రెండు నెలల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏమైనా సమస్యలు, సలహాలు కావాలంటే 1097 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే సమాచారం అందిస్తారన్నారు. కార్యక్రమంలో కృషి సంస్థ మేనేజర్ శ్రీనివాసులు, ఎల్‌టీ బాలాజీ, ఓఆర్‌డబ్ల్యూ పల్లవి, టీఓలు సురేంద్ర, చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

సురవరం మృతితో సీపీఐ గొప్ప నేతను కోల్పోయింది

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



కురబలకోట : సీపీఐ అగ్ర నాయకుడు, అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన సురవరం సుధాకర్‌రెడ్డి (83) మృతి యావత్ దేశానికి దిగ్భ్రాంతిని కల్గించిందని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. శనివారం ఆయన వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో మాట్లాడారు. జీవితాంతం వామపక్ష భావాలతో పేద, మధ్య తరగతి వర్గాల అభ్యున్నతికి కట్టుబడి పని చేశారన్నారు. ప్రజల పక్షాన ఎన్నో పోరాటాలు చేశారన్నారు. పాఠశాల స్థాయి నుంచే నాయకుడిగా, ఉద్యమ కారుడిగా ఎదిగారన్నారు. విశాలాంధ్ర పత్రికలో అపారమైన సంఖ్యలో వ్యాసాలు రాశారన్నారు. లోక్‌సభ సభ్యులుగా విశిష్ట సేవలు అందించారన్నారు. వ్యక్తిగా సౌమ్యుడు.. వక్తగా అద్వితీయుడిగా గుర్తింపు పొందారన్నారు. ఇతర భాషల నాయకుల ప్రసంగాలను తెలుగులోకి అనువదించడంలో దిట్టగా పేరు గాంచారన్నారు. మంచి చదువరి, పుస్తకాలు బాగా చదివే వ్యక్తిగా గుర్తింపు పొందారన్నారు. ఉమ్మడి రాష్ట్ర సీఎంగా చంద్రబాబు ఉన్న సమయంలో విద్యుత్ ఉద్యమంలో ఆయన తీవ్రంగా గాయపడడంతో పాటు జైలు జీవితం కూడా గడిపారన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం నిర్విరామంగా అవిశ్రాంత పోరాటం చేశారన్నారు. మత వాద, మిత వాద, బూర్జువ రాజకీయాలను ఎప్పటికప్పుడు ఎండగట్టారన్నారు. ఆయన ఎన్నో దేశాలు కూడా పర్యటించి అపార అనుభవాన్ని గడించారన్నారు. ఆయన మృతి సీపీఐకే కాదు ప్రజాస్వామ్య, వామ పక్షవాదులకు ఎప్పటికీ తీరని లోటని పేర్కొన్నారు. అపార అనుభవం కలిగిన గొప్ప మేధావిని, నేతను సీపీఐ కోల్పోయిందని చెప్పక తప్పదన్నారు. సురవరం ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి భగవంతుడు మనో ధైర్యం కల్పించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఇష్టపడి చదివితే లక్ష్యం సాధించవచ్చు



మాట్లాడుతున్న కేరీర్ కోచ్ రామమూర్తి

కురబలకోట : ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని పోలీస్ శాఖకు చెందిన మోటివేషనల్ స్పీకర్, కేరీర్ కోచ్ రామమూర్తి అన్నారు. అంగళ్లలోని డీమ్డ్ యూనివర్సిటీలో మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు శనివారం కేరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇష్టపడి చదవడం అంటే ఎక్కువ సేపు పుస్తకాలతో కాలం గడపడం కాదన్నారు. పాఠ్యాంశాలు గుర్తుండేలా శ్రద్ధ, ఆసక్తితో చదవడమన్నారు. ముఖ్యంగా శ్రమను ఆనందంగా మార్చుకోవాలన్నారు. ఇష్టపడి చదివితే లక్ష్యం వైపు నడిపిస్తుందన్నారు. పైకి రావాలంటే కాలం విలువ కూడా తెలుసుకుని ముందుకు సాగాలన్నారు. డబ్బును వృథా చేయరాదన్నారు. చిన్న మార్పులు దీర్ఘకాల విజయాలకు దారి తీస్తాయన్నారు. మొదటి సంవత్సరం నుంచి పట్టుదలతో ప్రయత్నిస్తే అది కేరీర్‌కు మైలురాయిగా మారుతుందన్నారు. విజయం కూడా దాసోహం కాగలదన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌పై ఫిర్యాదు

గుర్రంకొండ : జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ తీరుపై మండల కేంద్రమైన గుర్రంకొండకు చెందిన షంషేర్‌వలీ దర్గా ముత్తవల్లీ పి.కాలేషా మస్తాన్ జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ తీరుపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను వంశ పార్యంపరంగా షంషేర్‌వలీ దర్గా ముత్తవలీగా పని చేస్తున్నానని తెలిపారు. ఐదేళ్లకొకసారి రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో ముతవల్లీగా రెన్యూవల్ చేసుకోవాల్సి ఉందన్నారు. అయితే జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ గుర్రంకొండ దర్గా వద్దకు వచ్చి తనను దుర్భాషలాడారని అన్నారు. రెన్యూవల్ చేసుకోవడానికి గానూ రూ.లక్ష లంచం ఇవ్వాలని, లేనిపక్షంలో రెన్యూవల్ చేసుకోలేవని చెప్పాడన్నారు. సదరు వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ వేరే జిల్లాకు బదిలీపై వెళ్లి ఏడు రోజులు అవుతోందని, అయినా అతను ఇంకా జిల్లాలో తిరుగుతూ ఇలా లంచాలు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. జరిగిన సంఘటనపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిన ఇవ్వాల్సిందిగా జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారికి జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు

లక్కిరెడ్డిపల్లి : విద్యార్థి దశ నుంచి కష్టపడి చదివితే ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని లక్కిరెడ్డిపల్లి జూనియర్ సివిల్ జడ్జి భరత్ కమల్ పేర్కొన్నారు. మండల లీగల్ సర్వీస్ కమిటీలో భాగంగా శనివారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో హాస్టల్ వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాగా చదివి ఐఏఎస్, ఐపీఎస్, జడ్జి లాంటి ఉన్నత పదవులను దక్కించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పదోతరగతి, ఇంటర్మీడియట్‌లలో మంచి మార్కులు సాధిస్తే మంచి కళాశాలలో సీటు వస్తుందన్నారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదని సూచించారు. తల్లిదండ్రులు, పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్, కోర్టు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లౌడ్ కంప్యూటింగ్‌తో ఉద్యోగ అవకాశాలు



సెమినార్‌లో మాట్లాడుతున్న టెక్నికల్ లీడ్ రహంతుల్లా

మదనపల్లె సిటీ : క్లౌడ్ కంప్యూటింగ్‌తో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని ట్రయాంజ్ డిజిటల్ సర్వీసెస్ టెక్నికల్ లీడ్ డాక్టర్ వి.రహంతుల్లా అన్నారు. శనివారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ కంప్యూటింగ్ ఫండమెంటల్స్ హ్యాండ్స్ ఆన్ ప్రాక్టీస్‌పై సెమినార్ జరిగింది. క్లౌడ్ కంప్యూటింగ్ సేవలకు ఎటువంటి పరిధులు లేవని, ఎటువంటి సర్వీసులైనా అందిస్తుందన్నారు. క్లౌడ్ కంప్యూటరింగ్ వినియోగించడం వల్ల సాఫ్ట్‌వేర్, క్రాష్, డేటాలాస్ వంటి ప్రమాదాలు ఉండవన్నారు. భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న నిపుణులను రూపొందించడంలో క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి, కరస్పాండెంట్ రామమోహన్‌రెడ్డి, చైర్మన్ నాగమల్లారెడ్డి, ప్రిన్సిపాల్ రాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల వద్ద ప్రత్యేక నిఘా



సీఐ యుగంధర్

పీలేరు : పీలేరు సర్కిల్ పరిధిలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల వద్ద పోలీసులచే ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ యుగంధర్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ద్విచక్రవాహనాలలో తిరుగుతున్న ఆకతాయిలను పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థినుల పట్ల ఎవరైనా ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తించినా, అనవసరంగా రాద్ధాంతం సృష్టించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు ధైర్యంగా క్రమశిక్షణతో విద్యనభ్యసించి తమ లక్ష్యాలు చేరుకోవాలన్నారు. ఎవరిపైనైనా అనుమానాలు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ అధికారులు, జవాన్‌లు

కలికిరి : మాదక ద్రవ్యాల రహిత దేశం కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు కలికిరిలో సీఆర్‌పీఎఫ్(సీఐఏటీ-3) ఆధ్వర్యంలో శనివారం మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై ప్లకార్డులతో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాళెం వద్దనున్న సీఆర్‌పీఎఫ్ కేంద్రం నుంచి కలికిరి పట్టణం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల వరకు ర్యాలీ సాగింది. అనంతరం డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన సమావేశం నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ రాజేష్ కుమార్, అసిస్టెంట్ కమాండెంట్ మినిస్టాన్లీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, వినియోగంతో ఒక వ్యక్తితో పాటు ఆ కుటుంబం కూడా ఇబ్బందుల పాలవ్వాల్సి ఉంటుందన్నారు. మత్తు పదార్థాల వినియోగం నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేసినప్పుడే దేశం మాదక ద్రవ్యాల రహితంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌లు సెంథిల్‌కుమార్, శివస్వామి, జవాన్‌లు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలో నవశకం

రాయచోటి జగదాంబసెంటర్ : అంతరిక్ష పరిశోధనలో నవశకం మొదలైందని, పరిశోధనలో అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా భారత్ ఎదగడం భారతీయులందరికీ గర్వకారణమని డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ మడితాటి నర్సింహారెడ్డి అన్నారు. శనివారం డైట్ కళాశాల ప్రాంగణంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 ఆగస్టు 23న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చంద్రుని దక్షిణ ధృవంపై చంద్రయాన్-3లోని విక్రమ్ ల్యాండర్ ×శివశక్తి₹ అనే ప్రదేశంలో సురక్షితంగా దిగిందన్నారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం ఆగస్టు 23ను జాతీయ అంతరిక్ష దినోత్సవంగా నిర్ణయించిందన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, పోస్టర్ల తయారీ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు శివభాస్కర్, వైసి రెడ్డప్పరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గిరిబాబుయాదవ్, శివప్రసాద్, తిరుపతి శ్రీనివాస్, కేదార్‌నాథ్, మోహన్‌నాయక్, ఛాత్రోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా

గాలివీడు : మండలంలోని బలిజపల్లి వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు శనివారం ఉదయం గాలివీడు నుంచి నడింపల్లి వైపు వెళుతున్న ఆటో జగనన్న కాలనీ వద్దకు రాగానే అదుపుతప్పి బ్రిడ్జి మీద నుండి కింద పడిపోయింది. డ్రైవర్ చాకచక్యంగా దూకేయడంతో ప్రాణాపాయం తప్పింది. ఆటోలో ఉన్న పాల క్యాన్లు, ఎరువు బ్యాగులు కాలువలో పడ్డాయి. ఈ ఘటనలో ప్రాణ నష్టం జరగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.